గంజాయి రవాణాపై కఠిన చర్యలు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 29 : గంజాయి రవాణా, సరఫరా చేసినా కేసులు నమోదు చేసి, పీడీ యాక్ట్ అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని రామగుండం కమిషనర్ శ్రీనివాస్ హెచ్చరించారు. రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో గురువారం యూఐ, గ్రేవ్ లాంగ్ పెండింగ్ కేసుల పరిష్కారం, ఎస్సీఎస్టీ యూఐ కేసులు, ఫోక్సో కేసుల పరిష్కారం, ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసులపై మంచిర్యాల సబ్ డివిజన్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, మంచిరాల ఏసీపీ ప్రకాశ్, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రత్యేక నిఘా..

నంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు సీపీ తెలిపారు. అర్హత లేని వాహనాలపై ఉండే ప్రెస్, ఆర్మీ, పోలీస్, ఇతర శాఖల స్టిక్కర్లను తొలగించాలని, ప్రభుత్వం నిర్దేశించినట్లుగా నంబర్ పేట్లు ఉండాలని, వాహనాలకు బ్లాక్ ఫిలిమ్‌లు తొలగించాలని, సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. సెప్టెంబర్ 3 నుంచి జిల్లావ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

వాంకిడి, ఆగస్టు 29: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. గురువారం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను అదనపు కలెక్టర్ వేణు, డీఈవో అశోక్‌తో కలిసి సందర్శించారు. పాఠశాలకు మంజూరైన అదనపు తరగతి గదుల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది విధులపై నిర్లక్ష్యం చేయవద్దని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం, మెరుగైన బోధన అందించాలని సూచించారు. అంతకుముందు నార్లాపూర్ వాంకిడి-1ఏ అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అత్యుత్తమ సాంకేతికతతో సేవలు

మంచిర్యాలటౌన్, ఆగస్టు 29 : అత్యుత్తమ సాంకేతికతతో వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు విద్యుత్ శాఖ మంచిర్యాల ఎస్ఈ ఎన్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఎల్లప్పుడూ వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించేందుకు సాంకేతికతను అందిపుచ్చుకొని మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా సిస్టం ఆవరేజ్ ఇంటరప్షన్ డ్యూరేషన్ ఇండెక్స్ (సైది), సిస్టం ఆవరేజ్ ఇంటరప్షన్ ఫ్రీక్వెన్సీ ఇండెక్స్ (సైఫీ)ల ద్వారా విద్యుత్ అంతరాయాలను లెక్కించడం జరుగుతుందని తెలిపారు. వినియోగదారునికి కలిగే అంతరాయం సమయాన్ని గుర్తించి అందుకు తగ్గట్లు చర్యలు చేపడుతామని పేర్కొన్నారు.

నాణ్యమైన విద్యతోనే భవిష్యత్

కోటపల్లి, ఆగస్టు 29 : నాణ్యమైన విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మంచిర్యాల డీఈవో యాదయ్య అన్నారు. కోటపల్లి మండలం వెంచపల్లి, సూపాక(ఓ), సూపాక(కే), పారుపల్లి ప్రభుత్వ పాఠశాలను డీఈవో సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి జవాబాలు రాబట్టాడు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని, పాఠశాలకు విద్యార్థులు ప్రతిరోజూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సెక్టోరియల్ అధికారి చౌదరి తదితరులున్నారు.

రహదారి మరమ్మతులు చేపట్టాలి

కాసిపేట, ఆగస్టు 29 : కాసిపేట మండలం కొండాపూర్ యాపలోని రహదారిపై గుంతలు పూడ్చాలని, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆదివాసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. రహదారి పూర్తిగా ధ్వంసమవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయక్‌పోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, సామాజిక చైతన్య వేదిక సలహాదారులు మద్దివేణి చిన్న భీమయ్య, మండలాధ్యక్షుడు మల్లయ్య, ఆదివాసీ సేన మండల గౌరవాధ్యక్షుడు గంగారాం, అధ్యక్షుడు వెంకటేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం శంకర్, నాయక్‌పోడ్ సంఘం కార్యదర్శి శ్రీకాంత్, శంకర్, రాందాస్, నవీన్, మహేశ్, తరుణ్ పాల్గొన్నారు.

ఆర్ఎంపీ క్లినిక్‌లపై దాడులు

చెన్నూర్, ఆగస్టు 29 : చెన్నూర్ పట్టణంలోని ఆర్ఎంపీ డాక్టర్ల క్లినిక్‌లపై బుధవారం రాత్రి టీజీఎంసీ/ఐఎంఏ అధికారుల బృందం ఆకస్మిక దాడులు చేసింది. ఇందులో భాగంగా పట్టణంలోని బండారి లక్ష్మణ్ క్లీనిక్‌లో తనిఖీ చేసింది. మోతాదుకు మించి ఆంటిబయోటిక్, నొప్పులకు సంబంధించిన, ఐవీ ఫ్లూయిడ్స్, ఇతర హై షెడ్యూల్ మందులు ఇస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారనే విషయం బహిర్గతమైందని టీజీఎంసీ సభ్యుడు డాక్టర్ ఎగ్గన శ్రీనివాస్ తెలిపారు. ఆర్ఎంపీల బారినపడి ప్రజలు మోసపోవద్దని, ఆరోగ్యాలను పాడుచేసుకోవద్దని ప్రజలను కోరారు. అనారోగ్యంగా ఉంటే దగ్గరలోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లి, చికిత్స పొందాలని సూచించారు. ఈ దాడుల్లో టీజీఎంసీ అధికారుల బృందం డాక్టర్ సంతోష్, డాక్టర్ అనిల్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భీమారం, ఆగస్టు 29 : భీమారం పీహెచ్ఎఆర్‌డీ వైద్యుడు రంజిత్ కుమార్‌కు చెందిన మెడికల్ షాపు, క్లినిక్‌పై టీజీఎంసీ సభ్యులు, ఇతికల్ కమిటీ మెంబర్ డాక్టర్ ఎగ్గన శ్రీనివాస్ దాడులు చేశారు. ఇందులో టీజీఎంసీ కో ఆప్షన్ మెంబర్ సంతోష్, హెచ్ఆర్‌డీఏ అనిల్, ప్రసాద్, టిజీఎంసీ, ఎన్ఎంసీ వైద్యులు శ్రీధర్ తదితరులు ఉన్నారు.

కోట్నాక భీంరావ్ సేవలు చిరస్మరణీయం

సిర్పూర్(యూ), ఆగస్టు 29: మాజీ మంత్రి కోట్నాక భీంరావ్ ఆదివాసీల కోసం చేసిన సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని జైనూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావ్ అన్నారు. గురువారం కోట్నాక భీంరావ్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని భీంరావ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోట్నాక భీంరావ్ ఉన్నత చదువులు చదివి ప్రజలకు సేవ చేసేందుకు ఎమ్మెల్యేగా, ట్రైబల్ మినిస్టర్‌గా పని చేశారని కొనియాడారు. గిరిజనుల కోసం పాఠశాలలు, టీటీసీ కేంద్రం ఏర్పాటు చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తొడసం ధర్మారావ్, మాజీ వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాశ్, మాజీ సర్పంచ్ ఆత్రం ఓంప్రకాశ్, గ్రామ పటేల్ ఆత్రం ఆనంద్‌రావ్, నాయకులు ఆత్రం దౌలత్‌రావ్, నాగోరావ్, మోతీరాం పటేల్, శ్రీనివాస్, నీలకంఠం, మెస్రం భూపతి తదితరులున్నారు.

బెజ్జూర్, ఆగస్టు 29 : మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో గురువారం గోండ్ రాజ్ కొట్నాక భీంరావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాయి సెంటర్ నాయకులు శంకర్, ఆదివాసీ సంఘం మండలాధ్యక్షుడు తిరుపతి, మాజీ ఎంపీటీసీ సాయి, బక్కయ్య, కొలవార్ జిల్లా సహాయక కార్యదర్శి వెంకటేశ్ ఆదివాసీ నాయకులున్నారు.

మైనార్టీ గురుకులంలో విజిలెన్స్ తనిఖీ

కాగజ్‌నగర్, ఆగస్టు 29 : కాగజ్‌నగర్ మండలంలోని బలగల మైనార్టీ గురుకులం-1లో బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నాన్ మైనార్టీ విద్యార్థుల అడ్మిషన్ ప్రక్రియలో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపారు. నాన్ మైనార్టీ అడ్మిషన్ కోసం ముగ్గురు విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.40 వేలు తీసుకొని, మధ్యవర్తి మైనార్టీ గురుకులంలో సీటు ఇప్పించినట్లు ఫిర్యాదు చేసినట్లు విశ్వనీయ సమాచారం. ఈ విషయమై విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను సంప్రదించగా, అధికారులు తనిఖీ చేసిన విషయం వస్తవమేనని తెలిపారు. హైదరాబాద్ హెడ్ ఆఫీస్ నుంచి వచ్చిన మెయిల్ ఆధారంగానే మైనార్టీ గురుకుల విద్యాలయంలో సీట్లు కేటాయించిట్లు చెప్పారు.

టీజీఎస్ ఆర్టీసీ ఫ్యూయెల్ ఔట్ పంప్ తనిఖీ

చెన్నూర్ టౌన్, ఆగస్టు 29 : చెన్నూర్ పట్టణంలోని టీజీఎస్ ఆర్టీసీ ఫ్యూయెల్ ఔట్ పంప్‌ను అధికారులు గురువారం తనిఖీ చేశారు. ఆదిలాబాద్ రీజియన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ కే ప్రవీణ్ కుమార్, మంచిర్యాల డిపో మేనేజర్ ఎస్ జనార్దన్ తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఐదు లీటర్ల బ్రాస్ క్యాన్‌తో డెలివరీ చెక్ చేశారు. రికార్డులను పరిశీలించారు.

శాంతి కమిటీ సమావేశం

కాగజ్‌నగర్, ఆగస్టు 29: కాగజ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో గురువారం ముస్లిం పెద్దలతో సీఐ శంకరయ్య శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. పట్టణ ఎస్ఐ సుధాకర్, పోలీసు సిబ్బంది, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడా రంగంలో రాణించాలి

నస్పూర్/చెన్నూర్/దండేపల్లి/లక్షెట్టిపేట/వేమనపల్లి/కన్నెపల్లి/సిర్పూర్(యూ), ఆగస్టు 29 : ప్రభుత్వం క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తూ అనేక విధాలుగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నదని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో గురువారం నిర్వహించిన క్రీడా పోటీలకు హాజరై, మాట్లాడారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే కలెక్టరేట్‌లో నిర్వహించిన క్రీడాపోటీల్లో గెలుపొందిన ప్రభుత్వ ఉద్యోగులకు అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కీర్తి రాజ్‌వీర్‌తో కలిసి మెడల్స్ అందజేశారు. జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్, జడ్పీ సీఈవో గణపతినాయక్, అధికారి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రీడాకారులు, క్రీడాభిమానులు క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలో క్రీడా జ్యోతితో ర్యాలీ తీశారు. పలు క్రీడా పోటీల్లో బంగారు పతకాలు సాధించిన మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల విద్యార్థులు టీ రిషిత్, కే అఖిల్, కే సాయి రుత్విక్, టీ ప్రశాంత్‌ను సన్మానించారు. దండేపల్లి మండలం గుడిరేవు, వెల్గనూర్ ప్రభుత్వ పాఠశాలల్లో.., లక్షెట్టిపేట ప్రభుత్వ బాలికల పాఠశాల, మహాత్మా జ్యోతిబాపూలే వసతి గృహంలో.., వేమనపల్లి మండలం నీల్వాయి, కన్నెపల్లి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో.., సిర్పూర్(యూ) మండలం కోహిర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో వేడుకలు నిర్వహించారు.

నస్పూర్ : ఉద్యోగులకు మెడల్స్ అందిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

దేశ శాంతికే ఉపవాస దీక్షలు

కాసిపేట : ఉపవాస దీక్షలను ప్రారంభించి దీవిస్తున్న పాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షారోన్

కాసిపేట, ఆగస్టు 29 : దేశ శాంతి, క్షేమం కోసం ప్రతి ఏడాది 50 రోజుల ఉపవాస దీక్షలు చేస్తున్నట్లు కల్వరీ మినిస్ట్రీస్ పాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షారోన్ పేర్కొన్నారు. సోమగూడెం, బెల్లంపల్లి రహదారి మధ్యలో గల ప్రముఖ కల్వరీ మినిస్ట్రీస్ చర్చిలో గురువారం అట్టహాసంగా ఉపవాస దీక్షలు ప్రారంభమయ్యాయి. యేటా పండుగగా ఈ దీక్షలు చేపట్టనుండగా, ఈ ఏడాది 12వ ఉపవాస ప్రార్థనలను పాస్టర్ ప్రవీణ్ దేశ శాంతి సూచనగా పావురాళ్లను ఎగురవేసి ప్రారంభించారు. తెలంగాణతో పాటు, వివిధ రాష్ట్రాల నుంచి క్రైస్తవులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పాస్టర్ ప్రవీణ్ ప్రార్థనలు చేసి, దైవ సందేశాన్ని వినిపించారు. బేబీ అక్షయ ప్రత్యేక ఆరాధన సాంగ్ చేయగా, ఆల్బబ్ విడుదల చేశారు.

దాడులు సరికాదు

చెన్నూర్, ఆగస్టు 29 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత కల్పిస్తామని మేనిఫెస్టోలో పెట్టిందని, ఇప్పుడు తమపై దాడులు చేయిస్తున్నదని ఆ సంఘం జిల్లా సలహాదారుడు సాధనబోయిన కృష్ణ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్ఎంపీ వైద్యులపై చేస్తున్న దాడులు, నిర్బంధానికి నిరసనగా చెన్నూర్ పట్టణంలో గురువారం చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాలకు చెందిన పలువురు ఆర్ఎంపీ వైద్యులు నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వం తమపై అధికారులతో దాడులు చేయిస్తూ క్లినిక్‌లు మూసివేయాలని భయభ్రాంతులకు గురిచేస్తున్నదని ఆరోపించారు. అలాగే పలువురు ఆర్ఎంపీలపై అక్రమంగా కేసులు పెడుతూ, అరెస్టులు కూడా చేయిస్తున్నదని మండిపడ్డారు. అనంతరం తహసీల్దార్ మల్లికార్జున్‌కు వినతి పత్రం అందజేశారు. చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాల ఆర్ఎంపీ వైద్యులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ

కాగజ్‌నగర్, ఆగస్టు 29 : కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్ ఉమ్మడి గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం సామాజిక తనిఖీ చేపట్టారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో జీఆర్పీ శ్రీలత, తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

మా భూమిని మాయం చేసిన్రు

- సంతకం చేయకుండానే పట్టా వేరే వారికి మారింది
- అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు

పట్టాపాస్ బుక్‌లను చూపిస్తున్న అమృత

నెన్నెల, ఆగస్టు 29 : 'మా భూమిని మాయం చేసిన్రు.., మా సంతకం లేకుండా, మేము అమ్మకుండానే వేరే వారి పేరున పట్టా అయ్యింది.. అధికారులు న్యాయం చేయాలి..' అంటూ నెన్నెల మండలం మైలారం గ్రామానికి చెందిన గిరిజన మహిళ సంద్ర అమృత అధికారులను వేడుకున్నది. గురువారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే.. సంద్ర అమృతకు గొల్లపల్లి శివారులోని సర్వేనంబర్ 221/1లో 2.20 ఎకరాల లావాని భూమిని 2006, నవంబర్‌లో పట్టా చేసి, అధికారులు అమ్మతకు ధ్రువపత్రం అందజేశారు. 2018లో ధరణి పట్టా పాస్ పుస్తకం కూడా ఇచ్చారు. ఆ భూమిపై నెన్నెల గ్రామీణ బ్యాంక్‌లో పంట రుణం కూడా తీసుకుంటున్నారు. వారం క్రితం అమృత బ్యాంకుకు వచ్చి అధికారులను కలిసి, రుణం కావాలని అడిగింది. ఆమె పేరిట భూమి లేదని, మరొకరి పేరిట ఉందని చెప్పడంతో కంగుతిన్నది. చేసేది లేక భర్త శంకర్‌తో తహసీల్ కార్యాలయంలో ఆర్ఐ సులోచనను సంప్రదించారు. రికార్డుల్లో చూసి, పట్టా మరొకరికి అయ్యిందని చెప్పారు. భూమి అమ్మకుండా, సంతకం చేయకుండా ఎలా అవుతుందని అడిగితే తమకు తెలియదని జవాబిచ్చారు. తమ వద్ద ఉన్న రికార్డుల్లోనూ పట్టా చేసిన దాఖలాలు లేవని వెల్లడించారు. లావాని పట్టా భూమి అమ్మడం గానీ, కొనుగోలు గానీ చేయరాదు. పట్టాదారు మృతి చెందితే వారసులకు పట్టా చేసే వీలు మాత్రమే ఉంటుంది. కానీ, ఇక్కడి భూమి గొల్లపల్లి గ్రామానికి చెందిన సకినాల రాజేశ్ పేరిట పట్టాగా మారింది. దీనిపై బాధితురాలు తహసీల్దార్, బెల్లంపల్లి ఆర్డీవోకు ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ ప్రకాశ్‌ను వివరణ కోరగా, భూమి పట్టా మారిందని సంద్ర అమృత ఫిర్యాదు చేసినటుల తెలిపారు. తహసీల్దార్ లీవ్‌లో ఉన్నారని, ఆయన వచ్చిన తర్వాత విచారణ చేపట్టి న్యాయం జరిగేలా చూస్తామని వెల్లడించారు.

ఏబీసీ సెంటర్ నిర్మాణానికి భూమి పూజ

కాగజ్‌నగర్, ఆగస్టు 29 : కాగజ్‌నగర్ పట్టణంలోని న్యూ మారుతీనగర్ కాలనీలో ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ నిర్మాణానికి గురువారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు భూమి పూజ చేశారు. రూ.25 లక్షలతో నిర్మించనున్న ఏబీసీ దవాఖానతో కుక్కల బెడద నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షాహిన్ సుల్తానా, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, బీజేపీ నాయకుడు కొంగ సత్యనారాయణ, నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

నస్పూర్, ఆగస్టు 29 : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి సూచించారు. హైదరాబాద్ నుంచి గురువారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. నెలల వ్యవధిలోనే స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని, 3 దశల్లో జీపీ ఎన్నికల అనంతరం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, తర్వాత పురపాలక సంఘాల ఎన్నికలు ఉంటాయని వెల్లడించారు. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవో రాములు, భూసేకరణ ప్రత్యేక అధికారి చంద్రకళ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల శ్రమదానం

కౌటాల, ఆగస్టు 29 : కౌటాల నుంచి తుమ్మిహట్టి వరకు రోడ్డు మొత్తం గుంతలు పడి, కనీసం బైకులు కూడా వెళ్లలేని దుస్థితి నెలకొన్నది. విర్డండి బస్టాప్ వద్ద రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడడంతో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నాగపురే బండు శ్రమదానం చేసి గుంతలను పూడ్చారు. ఎమ్మెల్యే, అధికారులు ఎవరు పట్టించుకోకపోవడంతో రోడ్డులో గుంతలు మరింత ఎక్కువయ్యాయన్నారు. ఆయన వెంట విర్డండి యువకులు సిడాం సాగర్, శ్రీధర్, ఆలం తరుణ్, సచిన్ ఉన్నారు.

కౌటాలలో వర్షం

కౌటాల, ఆగస్టు 29 : కౌటాల మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో మండల కేంద్రంలోని ప్రధాన రహదారి చెరువును తలపించింది. రామాలయం, మార్కెట్ ఏరియా, తలోడి క్రాస్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు భారీగా రోడ్డుపైకి చేరింది.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

దండేపల్లి, ఆగస్టు 29 : మండలంలోని రెబ్బెన్‌ల్లి పాఠశాల 1995-96 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. వారు చదువుకున్న సమయంలో అటెండర్‌గా విధులు నిర్వహించిన శనిగారపు రాజేందర్ పక్షవాతంతో బాధపడుతున్నడు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలు అందించి, ధైర్యం చెప్పారు. విద్యార్థులు కొట్టె గోపయ్య, తిరుపతి, శ్యాంసుందర్, చారి, లచ్చన్న, నారాయణ, మున్న, మధూకర్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

దండేపల్లి,ఆగస్టు 29 : మండలంలోని కొండాపూర్‌కు చెందిన గంధం చరణ్ ఇటీవల ద్వారక వద్ద గల గోదావరిలో పడి మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబానికి గ్రామస్తులంతా రూ.30 వేలు పోగుచేసి, గురువారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇప్ప రవీందర్, ఇప్ప భూమయ్య, కారోబారి ప్రభాకర్, రాగం రాఖేశ్, ఇప్ప తిరుపతి, గంధం శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

116 గ్రాములు గంజాయి పట్టివేత

బెల్లంపల్లి, ఆగస్టు 29 : పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద 116 గ్రాముల గంజాయిని గురువారం టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నంబర్ 2 ఇంక్లైన్ బస్తీకి చెందిన నాగమల్ల దత్తాత్రేయ రైల్వేస్టేషన్ ముందు గంజాయి తరలిస్తున్నారనే సమచారం మేరకు నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు. అతని వద్ద గంజాయి స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వైద్య శిబిరం

వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

చెన్నూర్ రూరల్, ఆగస్టు 29 : ఆస్నాద్ గ్రామంలో గురువారం అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 107 మందికి పరీక్షలు చేసి, ఏడుగురికి జ్వరం ఉన్నట్లు నిర్ధారించారు. వారి రక్తనమూనాలు సేకరించినట్లు హెచ్ఈవో జగదీష్ తెలిపారు. వైద్యుడు వరిష్ ఖాన్, ఏఎన్ఎం కే గాయత్రి, కార్యదర్శి హరిత పాల్గొన్నారు.

పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలి

సిర్పూర్(యూ), ఆగస్టు 29 : వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ రామకృష్ణారావు అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో గురువారం వినాయక ఉత్సవ కమిటీ, గ్రామ కమిటీ సభ్యులు, ముస్లింలతో సమావేశం నిర్వహించారు. జైనూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావ్, గ్రామ పటేలు ఆత్రం ఆనంద్‌రావ్, అబ్దుల్, నాగోరావ్, ఆత్రం ఓంప్రకాశ్, ఆత్రం దౌలత్, అనిల్, హన్మంతు, ప్రేంసాగర్ తదితరులున్నారు.

ఆర్థిక సాయం అందజేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 29 : ఐఐఐటీ రాయచూర్ యూనివర్సిటీలో సీటు పొందిన విద్యార్థి మర్సుకోల కృష్ణకు ఆర్థిక సాయం అందజేయాలని కోరుతూ గురువారం కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు గోండ్వాన ఫౌండేషన్, కొలాం సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆత్రం రాజ్‌కుమార్, కొలం నాయకుడు మాడావి మన్కు ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

తిర్యాణి, ఆగస్టు 29 : మండల కేంద్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సహకార సంఘం బ్యాంకు ద్వారా రుణమాఫీ పొందిన రైతులు తిరిగి పంట రుణాలను పొందవచ్చని పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ గురువారం తెలిపారు. బ్యాంకులో 538 మంది రైతులకు ఖాతాలుండగా 331 మందికి రుణమాఫీ జరిగిందని తెలిపారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 29: మండలంలోని గుండి గ్రామానికి చెందిన గుబిడే ఉదయ్ కిరణ్ గతేడాది విద్యుత్‌ఘాతంతో మృతి చెందాడు. ఈ ప్రమాదంపై విద్యుత్ శాఖ అధికారులు విచారణ చేపట్టి గురువారం బాధిత కుటుంబానికి నష్టపరిహారంగా రూ.5 లక్షల చెక్కును గుండి మాజీ సర్పంచ్ జాబరి అరుణ రవీందర్ సమక్షంలో డీఈఈ జీవరత్నం అందజేశారు. ఏడీఈ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నాయకులు రాజు ఉన్నారు.

అక్రమ నిర్మాణం తొలగించాలి

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 29 : కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలోని వంజీరికి వెళ్లే దారిలో సర్వే నంబర్ 69/1/1లో అక్రమంగా నిర్మించిన దుకాణాన్ని తొలగించాలని గురువారం యజమాని నగునూరి శ్రీనివాస్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై హ్యూమన్ రైట్స్ ప్రొటక్షన్ సభ్యుడు శివకుమార్ మాట్లాడారు. దుకాణాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. అధికారులు పట్టించుకోవడలేదని ఆరోపించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

జైపూర్, ఆగస్టు 29 : మండలంలోని వేలాలలో రూ.20 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవనాన్ని గురువారం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ ప్రారంభించారు. ఆరోగ్య ఉప కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్ కుమార్ దీపక్‌కు బీపీ చెక్ చేసి, సేవలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులతో పాటు, ప్రభుత్వ వైద్యులు అనిత, అనిల్‌కుమార్, కుందారం పీహెచ్‌సీ వైద్యురాలు శ్రావ్య, పార్టీ మండలాధ్యక్షుడు ఫయాజ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భీమారం, ఆగస్టు 29 : భీమార